# 5
# మార్తా

"మనిషి తాను చేస్తోన్న పనిలో నుండే అనుభవజ్ఞానాన్ని పొందాడు. మనిషిలో ఎదిగిన మెదడు, చేతులు, ఆలోచన మనిషిని జంతువుల నుండి వేరుచేశాయి. ఇంతింత జ్ఞానాన్ని పొందిన మనిషి మళ్ళీ జంతువులా ప్రవర్తిస్తున్నాడు...."

"అది మనవాళ్ళమ్మాయిలా లేదుకదే... మొహంచూస్తే తెలీట్లా?" నిలదీసినట్లుగా అడిగి ధీమాగా కుర్చీ లాక్కుని కూర్చుంది దుర్గమ్మ. చిదంబరరహస్యమేదో కనిపెట్టేసినట్లుగా వుందామె స్వరం.

డైనింగ్‌టేబిల్ మీద ప్లేట్లు సర్దుతోన్న శర్వాణి మనసులో కలగుండు పడ్డట్టయింది. జారిపడబోయిన పింగాణీ ప్లేటుని చప్పున జాగ్రత్తగా పట్టుకుంది. శర్వాణి గుండెతోపాటు పింగాణీ ప్లేటు కూడా వజవజ వణికింది.

రాత్రి వచ్చినప్పటి నుండీ అత్తయ్య యింటిని మొదటిసారి చూస్తున్నట్లుగా పరికించి, పరిశీలించి చూడ్డం, మారుతి కేసి అనుమానంగా గుచ్చిగుచ్చి చూడ్డం గమనిస్తూనే వుంది శర్వాణి.

ఈ మాట అత్తయ్య అడుగుతుందని తెలుసుకానీ అది మరీ యింత తొందరగా జరుగుతుందని ఊహించలేదామె. తడబడుతూనే,

"మీరు తినేయండత్తయ్యా. ఈయన

రావడం లేటవచ్చు..." ప్లేటుని దుర్గమ్మ ముందుకు జరుపుతూ ఇడ్లీ వడ్డించబోయింది శర్వాణి.

కోడలు మాట మార్చడానికి ప్రయత్నిస్తోందని గమనించి, ఏదో జీవిత రహస్యాన్ని పాతాళంలో నుండి గేలంవేసి లాగుతున్నట్లుగా నిశితంగా కోడలికేసి చూసిందామె. ఆ చూడ్డం శర్వాణి కళ్ళల్లోకి సూటిగా, లోతుగా చూస్తున్నాయామె కళ్ళు.

ఆమె నోరు మందంగా వున్నప్పటికీ... గుండెలు ఆవేశంగా ఎగిసి పడ్తున్నట్లుగా అర్ధమవుతూనేవుంది.

కిటికీ పక్కగా వున్న నిమ్మచెట్టు మీంచి వీచిన గాలి విసురుగా వచ్చి దుర్గమ్మ జుట్టుని రేపింది చిందరవందరగా. అయితే ఆమె ఆవేశాన్ని మాత్రం చల్లబరచ లేకపోయింది.

శర్వాణి వడ్డించి వుంచిన ఇడ్లీ ప్లేటుని విసురుగా పక్కకి జరిపి చిర్రుబుర్రు లాడుతూ తన గదిలోకెళ్ళి పడుకుండిపోయింది దుర్గమ్మ.

హతాశురాలయిపోయింది శర్వాణి.

ఒకవైపు స్కూలుకి టైమైపోతోంది. తనింకా స్నానం చేయలేదు. మరోవంక టింకూ గాడు...

"అమ్మా! యింకా ఎంతసేపమ్మా... మారుతీ క్యారేజీ సర్దావా?" అంటూ కేకలు పెడ్తున్నాడు షూకి లేసులు కట్టుకుంటూ.

మారుతి పెరటి వాకిట్లో నిల్చుని భయంభయంగా శర్వాణి కేసి... టింకుకేసి మార్చిమార్చి చూస్తోంది.

రెండు నెలల క్రితం వీధి మలుపు వద్దనున్న పార్కులో కూర్చుని ఆటలాడుతోన్న పిల్లలవైపు దీనంగా, దిక్కుతోచక గుడ్లనీళ్ళు కుక్కుకుని చూస్తోన్న మార్తా కళ్ళముందు మెదిలింది శర్వాణికి. ఇప్పటి మారుతి చూపులు సరిగ్గా అట్లానే వున్నాయి.

అచేతనంగా వుండిపోయిన శర్వాణి అలజడి రేపుతోన్న టింకుగాడికేసి అప్రయత్నంగా కదిలింది.

✦ ✦ ✦

సరస్వతీనగర్ డైరెక్టు బస్సు వచ్చేదాకా ఆగదల్చుకోలేదు శర్వాణి. నిప్పొదాకా వెళ్ళే బస్సు ఎక్కి కూర్చుంది.

"ఫిబ్రవరిలోనే యింత ఎండేంటి?" నిప్పొదాకా వచ్చే తన కొలీగ్ హేమ అంది కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ.

పరిపరి విధాలుగా ఆలోచనలు పోతోన్న శర్వాణి మనసుని బయటి వేడి మరింత జ్వలింపజేస్తోంది.

అప్రయత్నంగా హేమ చేతిలోని బోటిల్ అందుకుని గటగటా నీళ్ళు తాగేసింది. అప్పట్లో యిలాగే తను బస్టాండులో మంచినీళ్ళు తాగినందుకు ఎంతెంత సీరియస్ మ్యాటరయి పోయిందో యింట్లో గుర్తొచ్చింది.

"అబ్బబ్బ శర్వాణీ ఏవిటాలోచిస్తున్నావ్... కార్డు," అన్నది హేమ కండక్టరు వంక చూపిస్తూ. నిర్వికారంగా పర్సులో నుండి కార్డు తీసి చూపించి మళ్ళీ దాచేసింది శర్వాణి.

అత్తయ్య అన్నం తిన్నదో, లేదో?

క్యాంపుకెళ్ళిన ప్రసాద్ తిరిగి వచ్చివుంటాడా?

మారుతి ఏమయిందో? ఎక్కడుందో?

అనుకుంటూ హేమవైపు తిరిగి తన పరధ్యానానికి కారణం చెప్పబోయింది శర్వాణి.

"ష్..." అంటూ అరచేయి అడ్డంపెట్టి, "శర్వాణీ! ఆరోజు నువ్వు వీధి చివర బస్సు దిగి పార్కు మీదుగా యింటివైపు నడుస్తూ ఏడుస్తోన్న మార్తాని చూసి వుండ నట్టయితే ఈరోజు ఈ సమస్య వచ్చివుండేదే కాదు అంతేనా?" అంది హేమ నవ్వుతూ.

హేమ అలా అంటుంటే బాధన్పించింది శర్వాణికి. తనని పదేపదే స్వంత విష యాలు చెప్పి విసిగిస్తున్నానేమోనన్న ఫీలింగ్‌తో మెల్లిగా కిటికీకి తలాన్చి కళ్ళు మూసు కుంది శర్వాణి. శర్వాణి మోకాళ్ళమీద చేయివేసి మెల్లిగా ధైర్యం చెప్తున్నట్లుగా నిమిరింది హేమ. ధైర్యానికి బదులు మరింత దిగులు ఆవరించింది శర్వాణి హృదయాన్ని.

అసలే అత్తయ్యకు తను వాళ్ళ శాఖ కాదనీ, ప్రసాద్‌ని వలలో వేసుకుని పెళ్ళి చేసుకున్నదనీ అభియోగం తన మీద.

మీదు మిక్కిలి దేవుడూ, దెయ్యమూ, పూజా పునస్కారమూ లేని యిల్లూ ఒక యిల్లేనా? అంటూ తమవద్ద కంటే ఎక్కువగా పెద్దకొడుకు యింట్లోనే వుంటుంది. పెద్దకోడలు ఆవిడకి అన్న కూతురు కావడం... అత్తయ్య చెప్పినట్లుగా మడీ, ఆచారం... అంటూ సొంటూ పాటించడం... పూజలూ వ్రతాలూ చేయడం అత్తమామలిద్దరూ అక్కడే వుంటుండేవారు.

ఎప్పుడయినా కాదూ, కూడదని తమ వద్దకు వచ్చినా అత్తయ్యే మడి కట్టుకుని వంట చేసిపెట్టేది. వాళ్ళున్న ఒకటి, రెండు రోజులకూ ఆవిడ్ని బాధపెట్టడమెందుకు లెమ్మని ప్రసాద్ కూడ ఏమనేవాడుకాదు.

మామయ్య టీచరుగా పనిచేసినంతకాలం బాపనయ్యవారుగానే పేరు పొందాడు. తమ వూరి స్కూల్లో బాపన పిలకాయల్ని, శూద్రుల పిల్లల్నీ, మాదిగ, మాల పిల్లల్నీ విడివిడిగా కూర్చోబెట్టేవాడాయన. ఆ విషయాలన్నీ అప్పుడప్పుడూ గుర్తుచేసుకుని బాధ పడ్తుంటాడు ప్రసాద్. రిటైరయిన తర్వాత ఆ వూరి గుడిపూజారి పనిని తండ్రి వారసత్వంగా

స్వీకరించాడాయన. ఆరునెలల క్రితం మరణించేంత వరకూ కూడ శుద్ధవైదీక నియమాలని పాటించేవాడాయన.

ఆ యింట్లో ఆయన కింద నలభయ్యేళ్ళు కాపురం చేసిన అత్తయ్య... తనప్రాంగ నాడు నియోగిననీ, శాఖ భ్రష్టుడయినందుకు ప్రసాద్‌తోను, తనతోనూ చాలాకాలం మాట్లాడకుండా భీష్మించుక్కూచున్న అత్తయ్య మారుతి మాదిగ అమ్మాయి అన్న సంగతి గుర్తించలేదు లెమ్మనుకోవడం నిజంగా తన తెలివితక్కువతనం.

బలవంతప్పెళ్ళిని తప్పించుకుని యింటినుండి పారిపోయొచ్చి పార్కులో కూర్చుని ఏడుస్తోన్న మార్తాని సముదాయించి యింటికి తీసుకొచ్చింది తను. మార్తాకి అయిదేళ్ళ వయసులో ఆ పిల్ల తలిదండ్రులిరువురూ క్రీస్తుల్లో కలిసినపుడు ఫాదర్ తనకి మార్తా అని పేరు పెట్టారనీ, తన చిన్నపుడే వాళ్ళు పనికోసం నాగపట్నం వెళ్ళి నిలిచిపోయినందువల్ల తనకి తెలుగు సరిగారాదనీ... తమిళం, తెలుగు కలిపి కూడికూడి చెప్పింది. ప్రసాద్ అత్తయ్యకి తెలీకుండా వుండడం కోసం మారుతి అని మార్చాడు.

'కులం' అన్న పదం ఎవరినోటనయినా వింటే మార్తా వొణికిపోతుంది. తొలినుండీ అనుభవించిన అణిచివేత, అంటరానితనం, దాని మూలంగా తల్లి శీలానికి విలువ లేకుండా పోవడం... దాని మూలంగానే, తండ్రి మరణం... యిలా ఒక జీవితమంతా ఒకటేనా... ఎన్నెన్నో జీవితాల్ని ఆ చిన్నపదం భయంతో వొణికిస్తోంది.

నిజంగానే మనిషికీ మనిషికీ నడుమ కన్పించని మాయ గోడ 'కులం.'

తమ స్కూల్లో తనతోపాటే పనిచేసే సరస్వతిని హెడ్‌మాస్టర్ రామశర్మ ప్రమోషనివ్వకుండా ఎన్నెన్ని యిబ్బందుల పాలుచేశాడో, ఒక పిల్లాడ్ని చిన్న మొటిక్కాయ వేసినందుకు వరస మెమోలిచ్చి ఎట్ల వేపుకు తిన్నాడో గుర్తొచ్చింది శర్వాణికి.

ఇలాంటి పట్టణాల్లో, నగరాల్లో అంతగా పట్టించుకోరు లెమ్మనుకుంటాంగానీ యిక్కడ కూడ చదువుకున్న సమూహాల్లో కూడ ముఖ్యంగా మేధోజీవుల్లో కూడ ఈ పదం మీద ఎంతెంత ఆరా... ఎంతెంత నిఘా... మొన్నటికి మొన్న అగ్రదేశం అమెరికాలోనే నీలిమ ఎంతెంత వివక్షనెదుర్కొనిందో ఆమె పోరాడితేనే కదా తెలిసింది.

హఠాత్తుగా శర్వాణికి మనం ఏ కాలంలో వున్నాం?... ఇరవై ఒకటో శతాబ్దిలోనేనా అని అనుమానమొచ్చింది.

"అమ్మా! నిప్పు ఫాక్టరీ వచ్చింది... దిగండి," కండక్టరు పెద్దగా అరుస్తుంటే ఉలిక్కిపడి తేరుకుంది శర్వాణి.

"నువు సరస్వతీనగర్ బస్సెక్కుతావో... మరేదయినా బస్సెక్కుతావో వుండు... నేనెక్కించి వెళ్తాను" అంటూ హేమ శర్వాణి చేయి పట్టుకుని ముందుకు కదిలింది.

✦ ✦ ✦

"అప్పుడు రాజులతో చేయి కలిపి మన పూర్వీకులు చేసిన ఆగడాల మూలంగా ఈ యుగంలో యిప్పటి యువతరమంతా ఇబ్బందులపాలవుతోంది, పశ్చాత్తాపపడు తోంది..." గదిలో నుంచి ప్రసాద్ గొంతు విన్పించగానే గుండెల మీదికి చెయ్యిపోనిచ్చి దీర్ఘంగా వూపిరి తీసుకుంది శర్వాణి.

వెనువెంటనే ఆమె కళ్ళు వేగంగా మార్తా కోసం వెదికాయి.

ఎక్కడా మార్తా జాడ కానీ, చప్పుడు కానీ లేదు. యింకా ట్యూషన్ నుండి రాలేదా? ఏమయిందో అర్థంకాక గుండెలు వేగంగా కొట్టుకున్నాయి శర్వాణికి.

పొద్దుట్నుండీ పడ్డ మానసిక ఒత్తిడి మూలంగానేమో కడుపులో మంటగా వుంది. వెళ్ళి ఏదయినా తిందామా అనుకుంది. కానీ అత్తయ్య భోంచేసిందో లేదో... ప్రసాద్ తిన్నాడో లేదో... ఎవ్వరూ ఏమీ తినకుండా తను తింటే బావుండదేమోనని ఫ్రిజ్‌లోంచి జ్యూస్ తీసుకుని తాగి కుర్చీ లాక్కుని డైనింగ్ టేబుల్ మీద మోచేతులాన్చి తలవాల్చింది శర్వాణి.

ఆమె తలలో ఏదో మండుతున్నట్లుగా వుంది.

ప్రసాద్ మాటలు అలలు అలలుగా గదిలోనుండి తేలివచ్చి శర్వాణి చెవుల్లో పడుతూనే వున్నాయి.

"మఠాధిపతుల వంశంలో పుట్టి యిలాటి అప్రాచ్యప్పనులు చేస్తానంటావేమిట్రా అంటావు అంతేనామ్మా? మఠాలు, పీఠాలు... వాటి అధిపతులు యిప్పటికీ చాలామంది చిన్న కష్టం... చిన్న శ్రమ కూడ చేయకుండా సమాజం సంపాదించే సంపదను మెక్కుతున్నారు. మెక్కుతూ కూడ ఆ సంపదలు సృష్టించే శ్రామికులకు వ్యతిరేకంగా ఈ మఠాలు, పీఠాలు, సన్యాసులు పనిచేస్తున్నారమ్మా... వీళ్ళంతా కూడ ప్రజల కోసం పనిచేసే ఒక కొత్త సమాజాన్ని కలగనాలమ్మా మనం. మనమెలాగూ అంతంత పెద్ద పనులు చేయలేం... కనీసం మనింట్లోనయినా మనం కులాన్ని వెలివేద్దాం..."

"మరీ యింత ఘోరంగా మాదిగ కూడు ఎట్ల తింటున్నావ్రా?"

అత్తయ్య గొంతు పీలగా సగం సగం మాటల్ని మాత్రమే మోసుకొస్తోంది.

'మారుతి చాల రుచిగా వంట చేస్తుందత్తయ్యా...' లోలోపలే గొణుక్కుంది శర్వాణి.

"మీరంతా అనుకుంటున్నట్టు దేవుడు కాదమ్మా మనల్ని సృష్టించింది... పంచభూతాలని మనం వేటినయితే చెప్పుకుంటున్నామో... ఒక ప్రత్యేకమయిన ఉష్ణోగ్రతా క్రమంలో అవన్నీ ఏకమయి జీవకణం ఏర్పడి... ఆ జీవకణం కొన్ని వేల లక్షల సంవత్సరాల పరిణామక్రమంలో యివ్వాల్టి మనిషి రూపం దాల్చింది. ఈ కులాలు, మతాలు, అంట్లు, ఆచారాలూ యివన్నీ కూడ మనం ఏర్పరుచుకున్నవేనమ్మా."

ఆదిమ మానవుడి అజ్ఞానం లోంచి... ప్రకృతిని శాస్త్రీయదృక్పథంతో అర్థం చేసుకో లేని తెలివితక్కువతనంలోంచి మాత్రమే మతం, దేవుడు అన్న భావాలు పుట్టాయనీ, ఆ క్రమంలో యజ్ఞయాగాది క్రతువులూ కర్మకాండలూ నిర్వహించడానికి ఏర్పడ్డ పూజారి వర్గం సామాన్యప్రజల్ని తమ కబంధహస్తాల్లో వుంచుకుని దోచుకుతినే పరాన్నభుక్కు వర్గంగా తయారయిందనీ... తమ పనులన్నింటినీ చేసిపెట్టడం కోసం మాత్రమే ఒక నిమ్నవర్గాన్ని తయారుచేసుకుందనీ... యిలా ఎన్నెన్నో విధాలుగా చరిత్రని తవ్వి తలకెత్తి తల్లికి నచ్చచెప్పాలని చూస్తోన్న ప్రసాద్‌ని చూస్తుంటే జాలి కలిగింది శర్వాణికి.

ప్రసాద్ ఈ మాటలు యిప్పుడేనా? గతంలో కూడ ఎన్నోసార్లు తల్లికి చెప్పే వుంటాడు. కానీ భర్త ప్రభావం ఆమె మీద ఎక్కువగా వుండేది. ఇంతసేపు మౌనంగా కూర్చుని ప్రసాద్ మాటలు వినడానికి కూడ ఆమెకి ఆసక్తీ, తీరికా రెండూ వుండేవికావు.

"ఎప్పుడో ఏ యుగంలోనో మన పూర్వీకులు ఒక పద్ధతిలోనో, ఆచారంలోనో కుదించబడి నన్ను మించినవారు లేరంటూ ఆధిపత్యాన్ని చేసి వుండొచ్చు. అంతెందుకు యిప్పుడు శూద్రకులాల్లోని ధనిక భూస్వాములు కూడ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని చెలాయిస్తూనే వున్నారు. అంతమాత్రంచేత అదే సరయిందని ఎలా చెప్తాం... నిరంతర సత్యాన్వేషణ మనిషికి తప్పనిసరి. నువ్వు కూడ బాగా ఆలోచించమ్మా... నాన్న వున్నంత కాలం నీక్కూడ నాన్నే ఆలోచించిపెట్టేవాడు... అది పూర్తిగా నాన్న వైపు నుండే వుండేది. అతడి మీద గౌరవవిశ్వాసమే నీకు స్వంత ఆలోచననేది లేకుండా చేసింది. ఇప్పుడిక నువు స్వంతంగా ఆలోచించడం నేర్చుకోమ్మా..."

అత్తయ్య ఆలోచించినట్టులేదు. ఏమన్నదో తెలీదు కానీ,

"అదెలా కుదుర్తుందమ్మా. పద్నాలుగేళ్ళు కూడ నిండని ఆపిల్ల ఎన్నెన్ని అవమానాలు, అణిచివేతలని, దుఃఖాలనీ భరించి వచ్చిందో తెలుసా? ఆపిల్ల జీవితాన్ని వింటే నువింత తేలిగ్గా ఆ మాటనవు. తండ్రి ఎప్పుడో లేడు... తల్లిని సునామి కబళించేసింది. నాగపట్నం నుండి కొట్టుకుంటూ , కొట్టుకుంటూ వచ్చి మనూరు చేరిందమ్మా. మన భాష రాదు... మన వూరు తెలీదు... ఈ కర్కశ ప్రపంచంలోకి ఆ అమాయకురాల్ని ఎలా వొదిలి పెట్టేయగలమమ్మా..." ప్రసాద్ గొంతు ఆవేదనగా వుంది.

✦ ✦ ✦

"అమ్మా! ఎందుకమ్మా శీనుని మా సార్ ఎప్పుడూ విసుక్కుంటూంటాడు... మీ బుర్రలకి అంతకంటే ఎక్కదులేరా... చాల్లే అంటూంటారు. మీకు చదువు చెప్పమని మా ప్రాణాలీస్తోంది చూడు ఈ ప్రభుత్వం అంటారు. యింకా చాలా అంటారు. వాడు ఏడుస్తాడు. నాకు చాలా బాధేస్తుందమ్మా..." ఎప్పట్నుండి యిదే ఆలోచనలో వున్నాడో కానీ హోంవర్క్ చేయడమాపి అన్యమనస్కంగా అడిగాడు టింకూ.

ఆ బ్రాహ్మణ అయ్యవారి విద్యాగర్వాన్ని అంచనా వేస్తూ కుక్కర్ సర్దుతోంది శర్వాణి.

అక్కడే కిటికీకి ఆనుకుని వున్న దివాన్ మీద గోడకి చేరగిలబడి ధ్యానమాలిక పుస్తకాన్ని తిరగేస్తోన్న దుర్గమ్మ చదవడమాపి,

"శీనూ అంటే ఏ కులం రా," అడిగింది ఆసక్తిగా.

కుక్కర్ పెట్టి వంటగదిలో నుండి చేతులు తుడుచుకుంటూ వస్తోన్న శర్వాణి మనసు రెపరెపలాడింది .

"కులం అంటే ఏమిటమ్మా?" శర్వాణి తేరుకోకముందే అడగనే అడిగాడు టింకూ.

తను ఆలస్యం చేస్తే అత్తయ్య ఎక్కడ దేవదేవుడి నోట్లో నుండి కళ్ళలో నుండి... చెవుల్లో నుండి, కాళ్ళలో నుండి పుట్టిన కులాల గురించి చెప్తుందోనని భయపడి చప్పున టింకూ పక్కన కూచుని,

"కులం అంటే ఏంకాదు నాన్నా... కులం అంటే శ్రమవిభజన యిలా అని అంబేద్కర్ ఏనాడో చెప్పాడు," అంది.

"అంబేద్కర్ అంటే ఎవరమ్మా?"

అంబేద్కర్ గురించి, జ్యోతిబాపూలే గురించి టింకుకి అర్థమయ్యేలా నాలుగైదు వాక్యాల్లో చెప్తుండగానే ప్రసాద్ వచ్చాడు.

"మనిషి తాను చేస్తోన్న పనిలో నుండే అనుభవజ్ఞానాన్ని పొందాడు. మనిషిలో ఎదిగిన మెదడు, చేతులు, ఆలోచన మనిషిని జంతువుల నుండి వేరుచేశాయి. ఇంతింత జ్ఞానాన్ని పొందిన మనిషి మళ్ళీ జంతువులా ప్రవర్తిస్తున్నాడు. క్షమాగుణం లేని జీవితం మనిషిని క్రూరుడ్ని చేస్తుంది..." అన్నాడు టింకు వాళ్ళ సార్ ప్రవర్తన విని.

కుల ఆభిజాత్యాన్ని, అహంకారాన్నీ వదిలిపెట్టి సహృదయ మానవుడిగా మారి పోయినట్టున్నాడతడు. అతడి ముఖం ప్రశాంతంగా బుద్ధుడి మొహంలా వుంది. దుర్గమ్మ వచ్చిన నాలుగురోజుల నుండి వరండాకే పరిమితమయిన మారుతి టింకు ప్రశ్నలూ, శర్వాణి జవాబులూ వింటూనే వుంది.

✦ ✦ ✦

టింకు పక్కలో పడుకుని కలత నిద్రలో అటు, ఇటు కదులుతోంది శర్వాణి.

" అత్తయ్యా ప్లీజ్! వెళ్ళొద్దత్తయ్యా!... మీరెళ్ళొద్దు. మాకు మారుతి కంటే మీరే ఎక్కువ అత్తయ్యా. వెళ్ళొద్దత్తయ్యా ప్లీజ్..." ఏడుస్తోంది శర్వాణి దుర్గమ్మని అడ్డుకుంటూ.

"అక్కా! యన్ను అనపాదె అక్కా.... నాపోమాటే... నేను పోనక్కా.... మాటే..." అంటూ మార్తా శర్వాణి కాళ్ళు పట్టుకుని ఏడుస్తోంది, తెలుగు తమిళాన్ని కలగలిపి.

బాష ఏదయినా, ప్రాంతమేదయినా మనిషి హృదయ స్పందనలొకటే కదా అన్పిస్తోందా పిల్లని చూస్తుంటే.

చేతిలో పుస్తకాన్ని పక్కనపెట్టి టేబిల్‌లైటు వెలుతురు లోంచి భార్యకేసి నిశితంగా చూశాడు ప్రసాద్.

నిద్రలోనే ఉలికిపడి... ఉలికిపడి కలవరిస్తోంది శర్వాణి.

ఎప్పుడొచ్చిందో శర్వాణి కాళ్ళ వద్ద కూర్చుని మార్తా ఏడుస్తోంది మెలకువలోనే.

వాళ్ళిద్దరినీ చూస్తుంటే కడుపులో దేవినట్టుగా అయింది ప్రసాద్‌కి.

అప్పటికి కోయిల గడియారం కుహు కుహుమంటూ పన్నెండుసార్లు అరిచింది.

ఈ హడావిడికి హాల్లో పడుకున్న దుర్గమ్మ ఎప్పుడు లేచిందో వచ్చి గుమ్మంవద్ద నిల్చుని శర్వాణికేసి, మారుతికేసి, ప్రసాద్‌కేసి మార్చిమార్చి చూస్తోంది.

అవాక్కయ్యాడు ప్రసాద్ తల్లిని చూసి. మారుతి లోపలికొచ్చిందని మళ్ళీ ఏం గొడవ జరుగుతుందోనని భయపడ్తూనే,

"అదేంటమ్మా అప్పుడే లేచావు... బస్సు నాలిగింటికి కదా, నేను లేపుతాలేమ్మా నువ్వు ప్రశాంతంగా పడుకో," అన్నాడు తల్లి దృష్టిని మళ్ళించాలని.

దుర్గమ్మ మాత్రం ప్రశాంతంగా లేదు. ఆ కళ్ళల్లో ఏదో ఒక నిశ్చయం... ఆ నిశ్చయంలోని తడబాటుతనమూ కూడా తొంగి చూస్తున్నాయి. ఆమె నిశితంగా కొడుకు వంక చూస్తూ,

" నేను... నేను వెళ్ళడం లేదురా," అంటూ ఒక క్షణం ఆగిందామె "రేపట్నుండి మారుతిని మార్తా అనే పిలుస్తాను... మార్తా మనతో పాటుగా ఇకమీద ఇంట్లోనే వుంటుంది" అన్నది. ఆమె గొంతు దృఢంగావుంది .

నిర్ఘాంతపోయిన ప్రసాద్ తేరుకోవడానికి చాలాసేపే పట్టింది.

అమ్మ మాటని 'అప్టు ది మార్క్'గా కాకపోయినా ప్రాథమిక మార్పుగా స్వీకరించిన ప్రసాద్ మనసు తొలకరి జల్లుకు పులకరించిన విత్తనమే అయింది.

*అరుణతార, జనవరి 2006*